దాతల సహకారంతో మెరుగైన సౌకర్యాలు



షెడ్ ప్రారంభోత్సవంలో ఈఓ లావణ్య, దాతలు

చంపాపేట: దాతల సహకారంతో చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని ఈఓ లావణ్య పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన రేకుల షెడ్‌ను సోమవారం ఆమె దాతలతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆలయ అర్చకులు వారిని ఆశీర్వదించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమలో దాతలు రాజుల పాటి శ్రీనివాస్, దటంపల్లి వెంకట్‌రెడ్డి, ఉష, గుజ్జ జైపీర్‌రెడ్డి, వాణి, విశాలమనోహర్, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణవేణి, బబ్బూరి ఆనంద్‌గౌడ్, శ్రీలత, కృష్ణప్రసాద్, నివేదిత పాల్గొన్నారు.

'మాదిగలపై ప్రభుత్వం చిన్నచూపు'

మన్సూరాబాద్: మాదిగలంటే సీఎం రేవంత్‌రెడ్డికి చిన్నచూపని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పొరంద మహేష్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మ విభూషణ్ అవార్డులను రాజకీయం చేయటం సీఎం రేవంత్‌రెడ్డికే చెల్లిందన్నారు. పద్మ అవార్డుల్లో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపిందని సీఎం పేర్కొనడం విడ్డూరంగా ఉందని, రాష్ట్రానికి చెందిన మంద కృష్ణమాదిగకు అవార్డును ప్రకటించడం సీఎం రేవంత్‌రెడ్డికి ఇష్టం లేదా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జాబితాలో మాదిగ జాతికి చెందిన వారు ఎందుకు లేరని ప్రశ్నించారు.

ప్రజావాణిలో రెండు ఫిర్యాదులు

చాదర్‌ఘాట్: ప్రజావాణి కార్యక్రమంలో సర్కిల్–6 మలక్‌పేటలో రెండు ఫిర్యాదులు అందాయని డీసీ జయంత్ తెలిపారు. అజంపురా డివిజన్ నుంచి మసీదుల వద్ద శానిటేషన్ చేయటం లేదని, అదే విధంగా ఓల్డ్‌మలక్‌పేటలో మూసీ పరీవాహక ప్రాంతానికి ఆనుకుని అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయన్నారు.

30 నుంచి వార్షికోత్సవం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మొద్దు లచ్చిరెడ్డి, విజయభాస్కర్

ఎల్‌బీనగర్: హరిహరపురం కాలనీ త్రిశక్తి దేవాలయంలోని శ్రీవరసిద్ధ వినాయక, శ్రీవల్లి దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర శ్రీఅభయాంజనేయస్వామి, మహాలక్ష్మీఅమ్మవార్ల ఏకాదశ వార్షికోత్సవం ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 3 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ విజయభాస్కర్ తెలిపారు.వార్షికోత్సవానికి సంబంధించిన బ్రోచర్‌ను స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. 30 నుంచి ప్రారంభమయ్యే వివిధ పూజాది కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఓపెన్ జిమ్ ప్రారంభం



ఓపెన్ జిమ్ ప్రారంభిస్తున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: డివిజన్ పరిధి చంద్రపురికాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను సోమవారం మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో 10 ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయటం జరిగిందని, చంద్రపురికాలనీలో రూ.12.50 లక్షలతో జిమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. కాలనీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధి సోమిరెడ్డి కాలనీవాసులు, నాయకులు పాల్గొన్నారు.

మంద కృష్ణకు అభినందనలు

చాదర్‌ఘాట్: మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ పురస్కారం ప్రకటించడం అభినందనీయమని డ్వాబ్ ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా మాదిగల రిజర్వేషన్ల కోసం ఆయన అలుపెరుగని పోరాటం చేస్తున్నారన్నారు. తెలంగాణలో దివ్యాంగుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడానికి ఆయన ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆయనను కలిసి విజ్ఞప్తి చేస్తామన్నారు.

హెచ్చరిక బోర్డులు తీసేసి..

ఆక్రమించేసి

- కబ్జాలకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలు
- చదును చేస్తూ, ప్రహరీ నిర్మాణం
- పరిరక్షించాలంటున్న స్థానికులు
- కాలాయాపన చేస్తున్న రెవెన్యూ అధికారులు

మలక్‌పేట: ప్రభుత్వ స్థలాలపై పర్యవేక్షణ లేక యథేచ్ఛగా కబ్జాకు గురవుతున్నాయి. ప్రభుత్వ స్థలమని బోర్డులు ఏర్పాటు చేస్తున్నా కబ్జాదారులు ఎలాంటి భయం లేకుండా వాటిని తొలగించి రాత్రికి రాత్రే ఆక్రమణలకు పాల్పడుతున్న దుస్థితి సైదాబాద్ మండల పరిధి మూసారంబాగ్ డివిజన్‌లో నెలకొంది. రూ. కోట్లు విలువచేసే ప్రభుత్వ స్థలాలు కనుమరుగవుతున్నా రెవెన్యూ అధికారులు మాత్రం నిద్రమత్తులో జోగుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక నేతల అండదండలతో కబ్జాదారులు ప్రభుత్వ స్థలాలలో పాగా వేస్తుంటే అధికారులు చోద్యం చూస్తున్నారని ఆయా ప్రాంతాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి కథనాలతో వెలుగులోకి..

ప్రభుత్వ స్థలాల కబ్జాల విషయమై గతంలో 'సాక్షి' వెలుగులోకి తెచ్చినప్పుడు నామమాత్రం తనిఖీలతో మమ అనిపించారు. దీంతో అధికారుల తీరు పట్ల ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వారి నిర్లక్ష్యంగా మూలంగా ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయనే విమర్శలు బహిరంగంగానే వినివస్తున్నాయి. ల్యాండ్ బ్యాంక్‌లోని స్థలంలో చేపట్టిన నిర్మాణాలు తొలగించి చర్యలు తీసుకోవడంలో అధికారులు ఎందుకు వెనకడుగు వేస్తున్నారో అర్థం కావడం లేదని డివిజన్ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సలీంనగర్ రెవెన్యూ భవన్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలం (వెకెంట్ ల్యాండ్) కబ్జా చేయడానికి భూ కబ్జాదారులు నానా రకాలుగా కుట్రలు చేస్తున్నారు. అయితే కాలనీవాసుల ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు ఖాళీ స్థలంలో బోర్డు పెట్టి గోడపై వెకన్సీ లాండ్ అని రాయించారు. నాలుగైదు సార్లు బోర్డు తీసేసి స్థలాన్ని ఆక్రమించుకోవడానికి కబ్జాదారులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మరోసారి 2021 మే నెలలో బోర్డు ఏర్పాటు చేశారు. అయితే గోడపై అధికారులు రాసిన రాతలు చెరిపేసి, బోర్డు తొలగించి ఇటీవల మట్టి కుప్పలు పోసి ఆ స్థలాన్ని చదును చేశారు. ఇంత జరుగుతున్న ఈ సంగతి అధికారులకు తెలియడం లేదా అని స్థానికులు చర్చించుకుంటున్నారు.



సలీంనగర్ ఖాళీ స్థలంలో అధికారులు పెట్టిన బోర్డు (ఫైల్)

బోర్డును తొలగించి మట్టితో చదును చేసిన దృశ్యం



ఫ్రెండ్స్ కాలనీలోని స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డు (ఫైల్)



బోర్డు తొలగించి నిర్మించుకున్న ప్రహరీ

అధికారుల పొంతనలేని సమాధానం..

మూసారంబాగ్ డివిజన్ ఫ్రెండ్స్‌కాలనీలో ప్రభుత్వ ల్యాండ్ బ్యాంక్‌లో ఉన్న స్థలంలో మండలాధికారులు ప్రభుత్వ స్థలమని బోర్డు ఏర్పాటు చేశారు. బోర్డు పెట్టి దశాబ్దాలు గడిచింది. కొన్ని నెలల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ఆ స్థలంలో ఉన్న బోర్డును తొలగించారు. అంతటితో ఆగకుండా రాత్రికి రాత్రే ముందుకు భాగంలో ప్రహరీ నిర్మించి గేటుకు తాళం వేసుకున్నారు. ఈ విషయం తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందిలో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ స్థలం ప్రభుత్వ ల్యాండ్ బ్యాంక్‌లో ఉందని, కబ్జా చేసింది ఎవరో తెలియదని చెప్పారు. అయితే ఆ స్థలంలో ఏర్పాటు చేసిన నిర్మాణాలు తొలగించేందుకు చర్యలు తీసుకోలేదని, అధికారులు కాలయాపన చేయడంలో ఉన్న ఆంతర్యం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

46 స్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంది



గతంలో సాక్షిలో ప్రచురితమైన కథనంతో మండల పరిధిలోని ప్రభుత్వ స్థలాలతో పాటు మూసారంబాగ్‌లో ఉన్న స్థలాన్నీ పరిశీలించాం. బోర్డులు విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. 46 స్థలాల్లో బోర్డు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. 50 బోర్డు కావాలని కోరాం. కబ్జా చేస్తున్నవారి వివరాలు సేకరిస్తున్నాం, వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం.

జయశ్రీ, తహసీల్దార్, సైదాబాద్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట: చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని సాయిరాంనగర్, కర్మన్‌ఘాట్ 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ పేర్కొన్నారు.ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు సాయిరాంనగర్, కర్మన్‌ఘాట్, గ్రీన్‌పార్కు, శ్రీనివాసనగర్, ఆర్‌టీసీ, కేశవనగర్ పరిసర కాలనీల్లో విద్యుత్ ఉండదన్నారు.

ఆస్మాన్‌గఢ్ పరిధిలో..

సైదాబాద్: మరమ్మతు పనుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌గఢ్ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు.. సిరిపురం కాలనీ, మనోజ్ మాన్షన్ అపార్ట్‌మెంట్స్, సిరిపురం కాలనీ కమ్యూనిటీ హాల్, మూసారాంబాగ్, జ్ఞాన్‌దీప్ టవర్, కృష్ణ తులసి నగర్, అండాళ్ నిలయం, దిల్‌సుఖ్‌నగర్ రోడ్, ఎస్‌బీహెచ్ బ్యాంక్, ఎస్‌బీఐ కాలనీ పార్క్, ఇంద్రానగర్, రాజరాజేశ్వరీ టెంపుల్, డీబీఆర్ డయాగ్నస్టిక్ సెంటర్, తనిష్క్ జువెలర్స్, నోబుల్ డిగ్రీ కాలేజ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.13, వంకాయ రూ.28, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.21, దొండ రూ.45, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.34, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.23, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.40, మునగ రూ.85, చిలుకడ దుంప రూ.65, బీట్‌రూట్ రూ.23, కీర రూ.35, బీన్స్ రూ.45, క్యాప్సికమ్ రూ.35. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికకు స్పందన



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సురభివాణి దేవి

నాగోలు: బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్సీ సురభివాణి దేవి అన్నారు. తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మునిపల్లె శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం కొత్తపేట శ్రీనివాస ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఉచిత బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాణిదేవీ హాజరై మాట్లాడారు. బ్రాహ్మణ సమాజాన్ని ఒక దగ్గరకు చేర్చి ఉచిత వివాహ పరిచయ వేదికలు నిర్వహించడం ఎంతో శుభ పరిణామని తెలిపారు. ఇలాంటి పరిచయ వేదికలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పవన్ కుమార్, తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వెన్నపల్లి జగన్ మోహన్ శర్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ మోత్కూరు రామేశ్వరరావు, గొల్లపూడి రాజేశ్వర్ రావు, భాస్కర మూర్తి, రఘునందన్, నాగరాజు, విజయలక్ష్మి,శశిధర్, విశ్వనాథ్, పార్థసారథి, పల్లవి, కల్పవల్లి పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి



కుశాల్‌గౌడ్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న గోపాల్ రెడ్డి, మదనాచారి

నాగోలు: పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని నారాయణ పాఠశాల డీఎం గోపాల్‌రెడ్డి, సీఓ మదనాచారి పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థి కుషాల్ గౌడ్ తెలంగాణ నుంచి హ్యాండ్ బాల్ టీం నుంచి జాతీయస్థాయి ఫైనల్స్‌కు ఎంపికై ప్రథమ బహుమతిని సాధించడంతో సోమవారం కుశాల్‌గౌడ్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టుదలతో కృషిచేస్తే ఏదైనా సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు షబ్బీర్ అలీ, పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

- రానివారు ఆందోళన చెందవద్దు
- మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు
- సాక్షితో పౌర సరఫరాల మలక్‌పేట సర్కిల్–1 అధికారి నర్సింగ్‌రాజు



చాదర్‌ఘాట్: అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు మంజూరు అవుతాయని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పౌర సరఫరాల మలక్‌పేట సర్కిల్–1 అధికారి నర్సింగ్‌రాజు పేర్కొన్నారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు వార్డు కార్యాలయాల్లో మళ్లీదరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రేషన్ కార్డుల కోసం దళారులను ఆశ్రయించవద్దని ఆయా కార్యాలయాల్లో అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. రేషన్‌కార్డుల అంశంపై ఆయన సాక్షికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరాలను వెల్లడించారు.

ప్రశ్న: రేషన్ కార్డు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు ఎవరు?

ఏసీఎస్‌ఓ: ప్రభుత్వ ఉద్యోగం, సొంత కారు, వంద గజాల స్థలంలో పక్కా ఇళ్లు, రూ. 2 లక్షలు వార్షికాదాయం కలిగిన వారు, మినహా మిగతా వారందరూ రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

సాక్షి: దరఖాస్తుతో పాటు ఎలాంటి పత్రాలు జత చేయాలి?

ఏసీఎస్‌ఓ: దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, కరెంట్ బిల్లు జత చేసి ఇవ్వాలి.

సాక్షి: ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారు ఇప్పుడు చేసుకోవచ్చా?

ఏసీఎస్‌ఓ: జీహెచ్‌ఎంసీ పరిధిలోని వార్డు కార్యాలయంలో కొత్త కార్డు, మార్పులు, చేర్పులు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

సాక్షి: ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి వాటిలో అర్హులు ఎంతమంది?

ఏసీఎస్‌ఓ: ఇప్పటి వరకు 18000 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 13631 దరఖాస్తులు పరిశీలించాం.

సాక్షి: గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకున్న వాటి పరిస్థితి ఏమిటి? వాటిని పరిగణనలోకి తీసుకుంటారా?

ఏసీఎస్‌ఓ: అన్నింటిని పరిగణనలోకి తీసుకుంటాం. అర్హత కలిగి ఉంటే కొత్త కార్డును జారీ చేస్తాం. ఇది నిరంతర ప్రక్రియ.

సాక్షి: వార్డు సభలు ఎప్పుడు జరిగే అవకాశాలు ఉన్నాయి?

ఏసీఎస్‌ఓ: గ్రేటర్ హైదరాబాద్‌లో ఫిబ్రవరి మొదటి వారంలో జరుగుతాయి.

సాక్షి: సర్కిల్–1 పరిధిలో ఎన్ని రేషన్ కార్డులు ఉన్నాయి? ఎంత మంది డీలర్లు ఉన్నారు.

ఏసీఎస్‌ఓ: మొత్తం 82395 రేషన్ కార్డులు ఉండగా 61 మంది డీలర్లు ఉన్నారు.

సాక్షి: రెండు రాష్ట్రాల్లో రేషన్ కార్డులు కలిగిన వారిని ఎలా గుర్తిస్తారు?

ఏసీఎస్‌ఓ: కొన్ని మురికివాడల్లో బయటి రాష్ట్రాల నుంచి వచ్చి స్థిర పడినవారు ఉన్నారు. వారు అక్కడి రేషన్ కార్డు కలిగి ఉంటారు. ఆధార్ కార్డును ప్రామాణికంగా తీసుకొని కార్డును మంజూరు చేస్తాం. కాబట్టి రెండేసి కార్డులు పొందేందుకు వీలుండదు. ఇక్కడ ఉంటే అక్కడ అర్హత కోల్పోతారు. అక్కడ ఉంటే ఇక్కడ అనర్హులు అవుతారు.

సాక్షి: పౌరులకు మీరిచ్చే సలహా ఏమిటి?

ఏసీఎస్‌ఓ: రేషన్ కార్డు లేదని ఎవరూ చింతించాల్సిన అవసరం లేదు. అర్హులందరికి రేషన్ కార్డులు తప్పకుండా జారీ చేస్తాం.

ఘనంగా అగాపే బాప్టిస్ట్ చర్చి వార్షికోత్సవం



చర్చి వార్షికోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్ శ్రీ శంకర్ కాలనీలో అగాపే బాప్టిస్ట్ చర్చి 34వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ పాల్గొని మాట్లాడారు. శ్రీ శంకర్ కాలనీ అగాపే బాప్టిస్ట్ చర్చి 34 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆనందం, శ్రీనివాస్, పాస్టర్ డేంజనాన్, జోసెఫ్, రమేష్ చారి, మంచి రాజేష్, వగ్గుల సత్యనారాయణ, తోట మహేందర్ యాదవ్ పాల్గొన్నారు.

జక్కయ్యకు ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్ పురస్కారం



ప్రశంసా పత్రం అందుకుంటున్న జక్కయ్య

మలక్‌పేట: విధి నిర్వహణలో ఉత్తమ క్రమశిక్షణ ప్రదర్శించి, రాష్ట్రస్థాయి టోర్నమెంట్లు నిర్వహించి విద్యార్థులను జాతీయస్థాయికి పంపించడంలో కీలకపాత్ర పోషించిన ఓల్డ్‌మలక్‌పేట ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్, ఎస్‌జీఎఫ్ గేమ్స్ అండర్–19 జూనియర్ కాలేజెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జక్కయ్య ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్ పురస్కారం అందుకున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయన హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతుల మీదుగా అవార్డు అందుకోవడంతో తోటి అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

సొంత నిధులతో బోర్‌వెల్ పనులు

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం, ఆర్‌కేపురం డివిజన్ పరిధి హరిపురి కాలనీలో నీటి సమస్య ఉన్నట్లు తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు మధుర ఉపేందర్ రెడ్డి మహిళా సంఘం భవనంలో సొంత నిధులతో బోర్ వేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, మురళీ, శ్రీనివాస్ రావ్, ప్రభాకర్ రెడ్డి, వెంకటేష్ గుప్తా, యాది రెడ్డి, యాదగిరి, వేమా రెడ్డి, అనిల్, శేఖర్ ముదిరాజు, సురేందర్, వంశీ, మహిళా అధ్యక్షురాలు సుకన్య, వాణి, లక్ష్మీ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలుకు వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

మలక్‌పేట: పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం సైదాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ మండల తహసీల్దార్ జయశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు అంజనేశ్వర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు భద్రత లేని నేషనల్ పెన్షన్ స్కీమ్‌లో భాగంగా కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. సీపీఎస్ విధానాన్ని ఉద్యోగులు దేశ వ్యాప్తంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. దీన్ని రద్దుచేసి 1980 రివైజ్డ్ పెన్షన్ రూల్స్ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో వెంకట్‌రెడ్డి, సాంబశివరావు, రఘువీర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి ఉన్నారు.

బస్తీ దవాఖానాలను సద్వినియోగం చేసుకోవాలి



దవాఖానాను సందర్శించిన అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్: బస్తీ దవాఖానాలను సద్వినియోగం చేసుకోవాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి సూచించారు. సోమవారం క్రాంతినగర్ కాలనీలోని బస్తీ దవాఖానాను ఆమె సందర్శించి మాట్లాడారు. గత కొన్నిరోజులుగా దవాఖానాలో డాక్టర్ అందుబాటులో లేక ఇబ్బందులు పడున్నామని స్థానికులు తన దృష్టికి తీసుకురాగా వెంటనే జిల్లా వైద్యశాఖ అధికారులతో చర్చించి డాక్టర్‌ను నియమించామని వివరించారు. బస్తీ దవాఖానా నూతన వైద్యురాలు డాక్టర్ ఫాతిమాను కార్పొరేటర్ సత్కరించారు. దవాఖానాకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. దవాఖానాలో ఏర్పాటు చేసిన రక్త పరీక్షల శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సునీత, బాబు, జగన్నాథం, గోపి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

యూజీసీ ముసాయిదా మార్గదర్శకాలను వెనక్కి తీసుకోవాలి



నిజాం కళాశాలలో నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌ఎఫ్ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా యూజీసీ ముసాయిదా మార్గదర్శకాలను వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని విఘాతం కలిగించేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం నిజాం కళాశాలలో ఏఐఎస్‌ఎఫ్ నగర సమితి ఆధ్వర్యంలో యూజీసీ–2025 చేపట్టిన నిబంధనలను వెనక్కి తీసుకోవాలని కోరుతూ ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాలలో వైస్ ఛాన్సలర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలకు సంబంధించి నిబంధనల మార్పుల కోసం ఇటీవల యూజీసీ జారీ చేసిన ముసాయిదా మార్గదర్శకాలు మన ఉన్నత విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా ఉన్నాయని మండిపడ్డారు. యూజీసీ మతోన్మాద రాజకీయాలను ప్రోత్సహిస్తుందని విమర్శించారు. తక్షణమే వెనక్కి తీసుకోవాలని లేని యెడలా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్, నాయకులు జ్ఞానేశ్వర్, ప్రవీణ్, నిఖిత, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలని పద్మశ్రీ పురస్కార గ్రహీతలు డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, పుల్లెల గోపీచంద్ అన్నారు. సోమవారం ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన అనంత్ బజాజ్ మెమోరియల్ తెలంగాణ రాష్ట్ర ఓపెన్ బాడ్మింటన్ టోర్నమెంట్‌లో మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారులు అద్భుత ప్రతిభను కనబరిచారు. అండర్–11 బాలికల విభాగంలో జరిగిన ఫైనల్ పోటీల్లో శాన్వి లట్టాల, ఎవిలిన్ ప్రియాంక జోడిలు ఫైనల్ పోటీల్లో గెలిచి బంగారు పతకాన్ని పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

చైతన్యపురి: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం దిల్‌సుఖ్‌నగర్‌లోని పుల్లారెడ్డి స్వీట్ హౌస్ సమీపంలో ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా రాజీవ్ చౌక్ నుంచి వేగంగా వచ్చిన యాక్టివా ఢీకొట్టగా కిందపడిపోయాడు. అదే సమయంలో వచ్చిన ఆర్టీసీ బస్సు అతడిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి సుమారు 50 ఏళ్లు ఉంటాయని సంబంధీకులు ఉంటే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.